## జిల్లా ఉపాధ్యక్షుడిగా సుభాష్‌నాయక్

-గురు చైతన్య ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ ఎంపిక

గోరంట్ల, జనవరి 25 ప్రభాతవార్త




గురు చైతన్య ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపకులు పాలేల రామాంజనేయులు యాదవ్ ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా కార్యాలయం నూతన జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఇందులో భాగంగా జిల్లా గౌరవాధ్యక్షులుగా రామకృష్ణ, జిల్లా అధ్యక్షులుగా గోరంట్ల మండలానికి చెందిన నీలం అశోక్, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున, ఆర్థిక కార్యదర్శిగా రాంప్రసాద్, అదనపు ప్రధాన కార్యదర్శిగా లోకేశ్వరి, అసోసియేట్ అధ్యక్షులుగా ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులుగా వెంకటేష్, రెడ్డప్ప రెడ్డి, సుభాష్‌నాయక్, సుధాకర్, జిల్లా కార్యదర్శులుగా నాగరాజు, మదార్‌వలీ, తిరుపాల్‌నాయక్, ఆలంవలి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రామాంజనేయులుయాదవ్, రాజేష్, ఎస్.నరసింహులు, మొరార్జీ, యాదవ్, దివాకర్‌లు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గ సహకారంతో ఏర్పాటవుతున్న గురు చైతన్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్రంలోనే మొదటగా సత్యసాయి జిల్లా కమిటీని ఆదివారం రథసప్తమి రోజున ఏర్పాటు చేయడం జరిగిందని, సిపిఎస్ రద్దే ప్రధాన అంశంగా సీనియర్ ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ఉపాధ్యాయ సమస్యలపై చైతన్యవంతంగా పోరాటం చేయడం జరుగుతుందని ఇందులో పెద్ద మొత్తంలో ఉపాధ్యాయులందరూ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఏపిసిపిఎస్‌ఈఏ వ్యవస్థాపకులు మరియు గురుచైతన్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులుయాదవ్, ఉపాధ్యాయులు బాలు, శేషాద్రి, విజయ్‌కుమార్, మొరార్జీ, బాలకృష్ణ, నాగభూషణ, కె.నాగేంద్ర, సోమిరెడ్డి, రవీంద్ర, కిష్టప్ప, శ్రీరాములు, మల్లి, ఈ.నాగేంద్ర, హనుమంతు, మిథున్‌కుమార్, నరసింహులు, శివశంకర్, రామకృష్ణ, దివాకర్, ప్రవీణ్, ఎం.సుధాకర్, స్టేట్ జాయింట్ సెక్రటరీ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ స్మృతి వనం పనులు పరిశీలన

అమరాపురం జనవరి 25 ప్రభాతవార్త



పనులు పరిశీలించిన దృశ్యం

మండల కేంద్రమైన అమరాపురం నందు చురుకుగా సాగుతున్న అంబేద్కర్ స్మృతి వనం పనులను అంబేద్కర్ స్మృతి వనం అధ్యక్షుడు ఉదుగూరు శివ కుమార్, స్మృతి వనం గౌరవ అధ్యక్షులు ఏ. నారాయణప్ప, ఆర్ జయ కుమార్ , సభ్యులు చెన్నప్ప తదితరులు పరిశీలించారు. ప్రస్తుతం మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలా కృషితో ఎంపీ పార్థసారథి నిధుల క్రింద మంజూరైన 17 లక్షల నిధులతో స్మృతి మనం అభివృద్ధి పథంలో నడుస్తున్నట్లు ప్రస్తుతం ప్రహరీ గోడ పనుల నిర్మాణం వేగవంతంగా సాగుతున్నట్లు ప్రహరీ గోడ నిర్మాణపు పనులను పరిశీలించారు. త్వరలో అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా స్మృతి వనం నందు డిజిటల్ లైబ్రరీ తో పాటు ఎస్సీ ఎస్టీలతో పాటు వెనుకబడిన వర్గాల యువతను ప్రోత్స హించడానికి వివిధ పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను అందుబాటులోకి తీసుకొచ్చి నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అనే నానుడిని అమలు చేయడంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టడానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. అదేవిధంగా నేడు జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు పాల్గొనాలని స్మృతి వనం అధ్యక్షుడు శివకుమార్, గౌరవాధ్యక్షులు ఏ నారాయణప్ప, ఆర్ జయకుమార్, ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, సిద్దేశ్వర తదితరులు సభ్యులకు విన్నవించారు.

## కళాకారులను ప్రోత్సహించడానికి కృషి చేద్దాం



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

అమరాపురం జనవరి 25 ప్రభాతవార్త

మండల పరిధిలోని పేలుబండ గ్రామానికి చెందిన యువకులు బెంగళూరులో వివిధ ఉద్యోగాలు నిర్వహిస్తున్న వారు మరియు స్థానిక యువకులు కలిసి ఫిబ్రవరి 4 న పేలుబండ లోనిర్వహించను న్నకురుక్షేత్రం పౌరాణిక నాటిక కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అదేవిధంగా పేలుబండ గ్రామస్తులు కళను ప్రోత్స హించాలనే ఉద్దేశంతో పాటు పురాతన ఇతిహాసాలను మరియు శ్రీకృష్ణుడి గీతాసారాన్ని తెలిపే పోస్టర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ ఎం టి.కాంతరాజు, మాజీసర్పంచులు ఈరన్న,ప్రసాద్,డి.ఆర్.రామన్న, రంగాపురంప్రభు,దొడ్డన్న, మల్లికార్జున,తిప్పేస్వామి, గోపాలప్ప,పవన్ కుమార్, లక్ష్మణ్,మంజునాథ్ తదితర గ్రామ ప్రముఖులు, యువత, కళాకారులు పాల్గొన్నారు. అదేవిధంగా బెంగళూరులో పేలుబండ గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీ రంగనాథ స్వామి కళాకారుల బృందం మరియు సంగీత నిర్దేశకులు రామకృష్ణప్ప ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో యువకళాకారులు కాంతరాజు, విశ్వనాథ్, మల్లికార్జున, వెంకటేష్, రాఘవేంద్ర, ముద్ద రామప్ప, విజయ్, వై సిద్దేశ్వర, కే సిద్దేశ్వర, శేఖర్ ,నాగరాజు, డి ఆర్ రమేష్, డి ఆర్ నాగరాజు, బి పవన్ కుమార్, మంజునాథ్, టి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా గ్రామ ప్రముఖులు గ్రామ ప్రజలు మరియు వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు విచ్చేసి ఈ కార్యక్రమాన్నివిజయవంతం చేయాలని కోరారు.

## ఏఎన్‌కె డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కసిరెడ్డిపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు




గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గోరంట్ల, జనవరి 25 ప్రభాతవార్త

ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలో భాగంగా 2వ రోజు ఏఎన్‌కె డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామాంజినేయులు ఆధ్వర్యంలో కసిరెడ్డిపల్లిలోని ప్రతి ఇంటికీ అధ్యాపకులు, విద్యార్థులు వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణం శుభ్రంగా ఉంచుకోవాలి, వేడి నీటిని తాగాలని, కొలాయిల దగ్గర మురుగునీరు ఉండకుండా చూడాలని స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జయప్రకాష్, బాబు, పాల్గొన్నారు.

## ఘనంగా నాడ ప్రభు కెంపేగౌడ జయంతి



కెంపేగౌడ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

గుండిబండ జనవరి 25 ప్రభాతవార్త

మండల పరిధిలోని శంకరగల్లు గ్రామంలో నాడప్రభు కెంపేగౌడ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ ఎన్ లక్ష్మినారాయణ,అమరాపురం సింగల్ విండో అధ్యక్షుడు గణేష్ ,రాష్ట్రా తెలుగు రైతు అధికార ప్రతినిధి కె.న.పల్లి సురేష్ ,రాష్ట్రా కుంచిటిగా వక్కలిగ సాధికార కన్వీనర్ పాండురంగప్ప లు పాల్గొని కెంపేగౌడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తనయుడు నరేంద్ర, మంజునాథ్, సత్యనారాయణ తదితర కుంచిటిగ వక్కలిగ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వివాహ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంఎల్సీ



వివాహ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంఎల్సీ

గుడిబండ జనవరి 25 ప్రభాతవార్త

మండల పరిధిలోని చిగతుర్పి గ్రామానికి చెందిన దాసప్ప కూతురు మేఘన వివాహం అగళి మండల కేంద్రంలోని ఆర్కే కళ్యాణ మంటపంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎంఎల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో అగళి జెడ్పీటీసీ ఉమేష్ పాల్గొన్నారు.

## నాగేపల్లిలో ఘనంగా ఓటర్ దినోత్సవం

కణేకల్ జనవరి 25 ప్రభాతవార్త

కణేకల్ మండల పరిధిలోని నాగేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జాతీయ ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ఓటు హక్కు ప్రతిజ్ఞ చేయించారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు తప్పనిసరిగా ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని అన్నారు. విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

-కరపత్రాల విడుదలలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య



కరపత్రాలు విడుదల చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

ఉరవకొండ, జనవరి 25 ప్రభాతవార్త

అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఈనెల 30, 31, ఫిబ్రవరి 1వ తేదీన గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుగుతున్నాయని రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, నియోజకవర్గ కార్యదర్శి ముష్టూరు వెంకటేష్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో ఆదివారం రైతులు, కౌలు రైతులతో కలిసి సమావేశాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమావేశాల సందర్భంగా వ్యవసాయ ఎగ్జిబిషన్, సెమినార్, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సమావేశాలకు జయలక్ష్మిదేవి, వేణుగోపాలరావు, రావూరు వీర రాఘవయ్య తదితర వ్యవసాయ నిపుణులు పాల్గొని కార్పొరేట్ వ్యవసాయం-రైతాంగంపై ప్రభావం, విద్యుత్ బిల్లు 2025 పర్యావసానాలు, కేంద్ర బహుళ సహకార చట్టం-రైతాంగంపై ప్రభావం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి-ప్రాజెక్టుల భవిష్యత్తు, 2025 ఉపాధి చట్టం-రాష్ట్రంపై ప్రభావం, ఎం.ఎస్.స్వామినాథన్ సిఫార్సుల అమలు-ప్రాధాన్యత, కౌలు చట్టం ప్రాధాన్యత తదితర అంశాలపై సెమినార్లతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు సుంకన్న, కుళ్లాయప్ప, ప్రభాకర్, లక్ష్మిదేవి, అనసూయమ్మ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శుభకార్యంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు

అమరాపురం జనవరి 25 ప్రభాత వార్త

మండల పరిధిలోని శివరం పంచాయతీ కరేకల్లుహట్టి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు బసవరాజ్ కుమార్తె వివాహ వేడుకల్లో ఆదివారం మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. విచ్చేసిన ప్రముఖులకు బసవరాజు కుటుంబ సభ్యులు సన్మానం చేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు నరసింహమూర్తి, మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగల్ విండో అధ్యక్షుడు గణేష్, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, చంద్రశేఖర్ గౌడ్, పి ఎం చంద్రశేఖర్, స్థానిక టిడిపి నాయకులు డీలర్ రమేష్, పేలుబండ రామన్న, గుజ్జారప్ప, పంచాయతీ కన్వీనర్ చిక్కన్న, టీచర్ టిడిపి యూనిట్ ఇన్చార్జ్ ప్రభాకర్, సీతారామప్ప, వీరముద్దన్న, ఈశ్వరప్ప, రమేష్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ కమీషన్ ఛైర్మెన్ నియోజకవర్గంలో హాస్టళ్లను తనిఖీ చేయాలి

-బీసీ సంక్షేమ హాస్టల్ సందర్శనలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధు



ఆహారాన్ని పరిశీలిస్తున్న ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధు

ఉరవకొండ, జనవరి 25 ప్రభాతవార్త

రాష్ట్ర ఫుడ్ కమీషన్ ఛైర్మెన్ ఉరవకొండ నియోజకవర్గంలోని ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధ కోరారు. ఆదివారం ఆయన పట్టణంలోని బీసీ బాలుర సంక్షేమ వసతిగృహాన్ని సందర్శించి అక్కడ విద్యార్థుల కోసం వండిన చికెన్ బిర్యానీను పరిశీలించారు. ఈ సందర ్భంగా సిద్ధ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హాస్టళ్లలో ఒక్కో విద్యార్థికి 80 గ్రాముల చికెన్ అందిస్తుంటే కేవలం 30 గ్రాముల చికెన్‌ను మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. బిర్యానీలో చికెన్ ముక్కలే కనబడటంలేదని తాము ప్రశ్నిస్తే బిర్యానీ కాబట్టి చికెన్ ముక్కలు అందులో కలిసిపోయి ఉంటాయని వార్డెన్లు చెబుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకొంటున్న హాస్టళ్ల నిర్వహణ సక్రమంగా లేదని విద్యార్థులు పౌష్టికాహారానికి దూరం అవుతున్నారని ఫుడ్ కమీషన్ ఛైర్మెన్ వెంటనే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా అధ్యక్షుడు నందు, నాయకులు అశోక్, వంశీ పాల్గొన్నారు.

## కళ్యాణోత్సవాల్లో పాల్గొన్న ఎంపీపీ

-సూర్యనారాయణస్వామి, లక్ష్మినరసింహస్వామికు ప్రత్యేక పూజలు

ఉరవకొండ, జనవరి 25 ప్రభాతవార్త



కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ యం.నరసింహులు తదితరులు

రథసప్తమి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని ప్రాచీన చోళరాజుల కాలంనాటి సూర్యనారాయణస్వామి ఆలయం, ప్రసిద్ధ పెన్న హోబిళం లక్ష్మి నరసింహ స్వామి ఆలయాల్లో ఆదివారం జరిగిన స్వామివార్ల కళ్యాణ మహోత్సవాల్లో ఎంపీపీ యం.నరసింహులు పాల్గొన్నారు. తొలుత ఆమిద్యాలలో సూర్యనారాయణస్వామి, చెన్నకేశవస్వామి, రామలింగేశ్వరస్వామిను దర్శించు కున్న అనంతరం ఉష, ఛాయ సమేత సూర్యనారాయణస్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆయనకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట విడపనకల్లు మాజీ జెడ్పీటీసీ ఎస్.తిప్పయ్య, ఆమిద్యాల సర్పంచ్ శ్రీరాములు, వెలిగొండ సర్పంచ్ వీరాంజినేయులు, ఆమిద్యాల ఎంపీటీసీ ఓబయ్య, వైఎస్సార్సీపీ నాయకులు వడ్డే ఆంజినేయులు తదితరులు ఉన్నారు.

## అశ్వత్థంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభించిన సిఐ శివగంగాధర్‌రెడ్డి

పెద్దపప్పూరు, జనవరి 25 ప్రభాతవార్త

మండలంలోని చిన్నపప్పూరు సమీపం లోని పెన్నానది తీరాన వెలసిన అశ్వత్థం లో ఆదివారం ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తాడిపత్రి రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి ప్రారంభిం చారు. మాఘమాసం తొలి ఆదివారం పురస్కరించుకుని శ్రీఅశ్వత్థ నారాయణస్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా వుండాలన్న ఉద్దేశ్యంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సేవా సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలపై సిఐ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ గౌరవ సలహాదారు శ్రీరంగయ్య, అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, సభ్యులు సుధాకర్, పద్మావతి, పాల్గొన్నారు.

## గణితంలో మూడు ప్రపంచ రికార్డులు సాధించిన విజన్ హైస్కూల్ విద్యార్థులు




. ప్రతిభ చూపిన విద్యార్థులు

యాడికి, జనవరి 25 ప్రభాతవార్త

యాడికి విజన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు గణితంలో తమ అసాధారణ ప్రతిభను ప్రపంచానికి చాటు తూ మూడు వేర్వేరు ప్రపంచ రికార్డులు సృష్టించారు. తక్కువ వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంద డం పట్ల ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రె డ్డి, మాజీ ఎమ్మె ల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డిలు విజన్ విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు జ్ఞాపికలను అందించి వారిని అభినంది ంచారు. ఈ విజయం పట్ల విద్యావర్గాలు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి యెలిగండ్ల భవ్యశ్రీ 50 అంకెల సంఖ్యను 25తో అత్యంత వేగంగా గుణించి ప్రపంచ రికార్డును నెలకొల్పింది.

2025 డిసెంబర్ 29న జరిగిన రికార్డు ప్రయత్నంలో ఆమె 42.98 సెకన్లలో గణిత గుణక్రియను విజయవంతంగా పూర్తి చేసి వరల్డ్‌వైడ్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సంపాదించింది. మరొక విద్యార్థి తుంగా జాహ్నవి మానసిక గణితంలో (మెంటల్ మ్యాథ్స్) ఐదవ వర్గమూలాలను అత్యధికంగా పరిష్కరించిన టీనేజర్‌గా ప్రపంచ రికార్డు సాధించింది. 2026 జనవరి 3న నిర్వహించిన ఈ రికార్డు ప్రయత్నంలో ఆమె 55.37 సెకన్లలో 30 ఫిఫ్త్ రూట్ లెక్కలను మానసికంగా పరిష్కరించి అందరి ప్రశంసలు అందుకుంది. మరొక విద్యార్థి మరాటి వర్షితాబాయి 50 అంకెల సంఖ్యను 125తో అత్యంత వేగంగా గుణించి ప్రపంచ రికార్డు సృష్టించింది. 2025 డిసెంబర్ 31న జరిగిన రికార్డు ప్రయత్నంలో ఆమె 41.15 సెకన లెక్క పూర్తి చేసి గణిత రంగంలో అరుదైన ఘనత సాధించినట్లు విజన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్ తెలిపారు. వేదిక్ మ్యాథ్స్ ట్రైనర్ అనిల్ బండారు కఠిన సాధన మార్గదర్శకత్వంలో సాధ్యమయ్యాయని విద్యార్థులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ప్రపంచ స్థాయిలో రాణించగలరని ఈ విద్యార్థులు నిరూపించాయని వారు తెలిపారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు ఘనంగా అభినందించి భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ రికార్డులు సాధించాలని వారు ఆకాంక్షించారు.

## వాలీబాల్ ఆట ఆడుతూ కుప్పకూలి మృతి చెందిన జావిద్



వాలీబాల్ ఆట ఆడుతూ మృతి చెందిన జావిద్ ఫైల్ ఫోటో

నల్లచెరువు జనవరి :25 ప్రభాతవార్త.

నల్లచెరువు మండల పరిధిలోని కే, పూలుకుంట గ్రామంలో. ఖలీల్ కుమారుడైన జావీద్ 19, వాలీబాల్ ఆడుతూ కుప్పకూలడంతో విషాద చాయలు ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు స్నేహితు వెంటనే నల్లచెరువులో ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గ్రామస్తులు మాట్లాడుతూ కొంతమంది యువకులతో కలిసి వాలీబాల్ ఆడుతున్న జావీద్ కోర్టు లోనే ఆట ఆడుతూ కుప్ప కూలి పోవడంతో తల్లిదండ్రులు జావిద్ మృతితో వాలీబాల్ ఆట ఆ ఇంటికి శాపంగా మారింది చేతికి ఎదిగిన కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రులు తల్లి డిల్లిపోయారు.

## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

-హాజరైన వైసిపి కదిరి సమన్వయకర్త బిఎస్ మక్బుల్, మండల కన్వీనర్ మబ్బు అశోక్‌వర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బిఎస్ మక్బుల్

తనకల్లు, జనవరి 25 ప్రభాతవార్త

తనకల్లు మండల కేంద్రంలో ఆదివారం వైసిపి నాయకులు, కార్యకర్తలతో వైసిపి కదిరి సమన్వ యకర్త బిఎస్ మక్బుల్ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమ ంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు ప్రతి గ్రామంలోనూ పార్టీ బలోపేతం చేసే దిశగా అన్ని విభాగాలకు పార్టీ క్యాడర్‌ను భాగస్వామ్యం చేస్తూ మండల స్థాయిక మిటీలు, పంచాయతీ కమిటీలు, గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా నాయకులు కార్యకర్తలు, కలిసి పని చేయాలన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా, రాష్ట్ర ఆక్టివిటీ కార్య దర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర పంచాయతీ వింగ్ సెక్రటరీ పోరె డ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి, మండల కన్వీనర్ మబ్బు అశోక్‌వర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు దేశాయ్ సంజీవరెడ్డి, వెంక టరామిరెడ్డి, తనకల్లు మండలం ఎంపిటిసిలు, సర్పంచులు, వార్డు మెంబర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలూరు సాంబశివారెడ్డిని కలిసిన పేరం స్వర్ణలత



ఆలూరు సాంబశివా రెడ్డికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న పేరం స్వర్ణలత

తాడిపత్రిటౌన్, జనవరి 25 ప్రభాతవార్త

వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డిని ఆదివారం తాడిపత్రి పట్టణానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత అనంతపురం పట్టణంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ కార్యక్రమంలో పేరం అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## బాధితురాలిని పరామర్శించిన రమేష్‌రెడ్డి



వివరాలు తెలుసు కుంటున్న రమేష్ రెడ్డి

తాడిపత్రిటౌన్, జనవరి 25 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని టైలర్స్ కాలనీకి చెందిన దీపు అనే అమ్మాయికి చెందిన స్కూటీ, రెండు సైకిళ్లను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం కాల్చివేశారు. దీపు గతంలో వాలంటీర్‌గా పనిచేస్తుండేది. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి ఆదివారం ఆమె నివాసం వద్దకు వెళ్లి పరామర్శించారు.

## అనారోగ్యంతో వైసిపి కార్యకర్త మృతి



నివాళులు అర్పిస్తున్న వైసిపి నాయకులు

తనకల్లు, జనవరి 25 ప్రభాతవార్త

తనకల్లు మండలం ఎస్‌సి కాలనీకి చెందిన వైఎస్ఆర్‌సిపి కార్యకర్త ఎం.నరసింహులు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి కదిరి ఇన్‌చార్జ్ బిఎస్ మక్బూల్, కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తర్ చాంద్‌బాషా, మండల కన్వీనర్ అశోక్‌వర్ధన్‌రెడ్డితో పాటు వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు నరసింహులు నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

## 50 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరైన విద్యార్థులు

**కళ్యాణదుర్గం జనవరి 25 ప్రభాతవార్త**

పట్టణంలోని కరణం చిక్కప్ప గవర్నమెంట్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఉత్సాహంగా జరిగింది. 1976, 1979 సంవత్సరాల్లో పదో తరగతి, ఇంటర్ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ విద్యార్థి దశ జ్ఞాపకాలను నెమరువేశారు. పాఠశాలలో గడిపిన మధుర క్షణాలు, అప్పటి విద్యా విధానం, గురువుల సేవలు గురించి పూర్వ విద్యార్థులు పరస్పరం అనుభవాలు పంచుకున్నారు. "ఒరేయ్, రారా, పోరా" అంటూ ఆప్యాయంగా పలకరించుకోవడం సమావేశానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గురువుల మార్గనిర్దేశం వల్లే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్నామని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాడు తమకు విద్యనందించిన గురువులు శ్రీరాములు, నాగభూషణం, సుబ్రమణ్యం, మహమ్మద్ ఖాన్‌లను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తమతో పాటు చదువుకున్న సుమారు 38 మంది స్నేహితులు కాలగర్భంలో కలిసి పోయిన విషయం బాధాకరమని పేర్కొంటూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం గ్రూప్ ఫోటోలు దిగుతూ సంబరాలు చేసుకున్నారు. విందు భోజనం అనంతరం కొత్త ఆశలతో వీడ్కోలు పలికారు. మొబైల్ ఫోన్లు కూడా లేని రోజుల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులను 50 ఏళ్ల తర్వాత ఒకచోట చేర్చిన నిర్వాహకుల చొరవ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం పాత స్నేహాలను మరింత బలపరిచిన సందర్భంగా, విద్యార్థి జీవితం విలువను మరోసారి గుర్తు చేసిన మధుర జ్ఞాపకంగా నిలిచింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ స్టెప్ డాన్సులతో అలరించారు, సందడి చేస్తూ ఆకట్టుకున్నారు.

## ఆర్టీసీ బస్సులో పోయిన బంగారు నగలు స్వాధీనం

**- ఫిర్యాదుదారుడు సంతోష్ కుమార్‌కు అప్పగింత**

**కళ్యాణదుర్గం జనవరి 25 ప్రభాతవార్త**



బంగారు నగలను బాధితునికి అందజేస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం పట్టణం మారెం పల్లికి చెందిన హుస్సేన్ బంధువు మస్రూర్ (19.01.2026) తేదీన తన సొంత ఊరు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మొరదాబాద్‌కు వెళ్లేందుకు కళ్యాణదుర్గం నుంచి కడపకు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కాడు. అదే బస్సులో అనంతపురం బస్టాండ్ వద్ద కడప టౌన్‌కు చెందిన సంతోష్ కుమార్ తన లగేజ్‌తో పాటు బస్సు ఎక్కాడు. మస్రూర్ రైలులో ప్రయాణం చేయడానికి తాడిపత్రిలో బస్సు దిగుతూ పొరపాటున సంతోష్ కుమార్‌కు చెందిన బ్యాగ్‌ను తీసుకుని దిగాడు. బస్సు తాడిపత్రి దాటిన తర్వాత తన బ్యాగ్ కనిపించక పోవడంతో, అందులో 3.5 తులాల బంగారం ఉన్నట్లు సంతోష్ కుమార్ డ్రైవర్‌కు సమాచారం అందించాడు. డ్రైవర్, సదరు మస్రూర్ కళ్యాణదుర్గంలో బస్సు ఎక్కినట్లు తెలిపాడు. దీనిపై సంతోష్ కుమార్ కళ్యాణ దుర్గం టౌన్ సీఐ హరినాథ్‌కు ఫిర్యాదు చేయగా, అప్రమత్తమైన సీఐ హరినాథ్ తన సిబ్బందితో కలిసి సీసీ కెమెరాలను పరిశీలించి, మొరదాబాద్ లో ఉన్న మస్రూర్ ఆచూకీని గుర్తించారు. అనంతరం సదరు బ్యాగ్‌లో ఉన్న సంతోష్ కుమార్‌కు చెందిన 3.5 తులాల బంగారం మరియు ఇతర వస్తువులను వెనక్కి తెప్పించి బాధితుడికి అందజేశారు. తప్పిపోయిన బంగారాన్ని వెనక్కి తెప్పించడంలో కృషి చేసిన సిబ్బంది లింగరాజు, మోహన్ కృష్ణలను జిల్లా ఎస్పీ జగదీశ్ అభినందించారు.

## మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న కాపు



మండల బిజెపి నాయకులతో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు

**డి.హిరెహాళ్ జనవరి 25 ప్రభాతవార్త**

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయదుర్గం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి మండల బిజెపి నాయకులతో కలిసి మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదివారం డి.హిరెహాళ్ మండలం జాజరుకల్లు గ్రామంలో కాపు సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి స్వగృహంలో ఎంపీపీ సలహాదారులు, బిజెపి నాయకుడు వన్నూరుస్వామి, బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలిసి మాన్ కి బాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. జాజరకల్లు సర్పంచ్ స్వగృహంలో బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలిసి టీవీలో ప్రచారమైన మన్ కీ బాత్ కార్యక్రమంను కాపు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఓబులాపురం సర్పంచ్ బోయ మల్లికార్జున, మండల బిజెపి నాయకులు రాళ్ల తిమ్మారెడ్డి, జి.సత్యనారాయణరెడ్డి, కల్యం సురేష్, వెంకటేష్ రెడ్డి, వసగుడ్డం మంజు, మైనార్టీ నాయకులు ఖాసింపిర, హనుమన్న, గిరీష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన మాల్యం గ్రామం



సుంకులమ్మ దేవి రథోత్సవం అంగరంగ వైభవం

**కనేకల్ జనవరి 25 ప్రభాతవార్త**

కనేకల్ మండల పరిధిలోని మాల్యం గ్రామంలో కొలువైన శ్రీ సుంకులమ్మ దేవి రథోత్సవం ఆదివారం సాయంత్రం భక్తుల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి రథోత్సవాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించగా, పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రథోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కళాకారుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే చిన్నపల్లెలచే నిర్వహించిన చెక్కభజన కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ పరిసరాలు భక్తుల జయజయధ్వానాలతో మార్మోగాయి. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శరభన్నగౌడ మహేష్ గౌడ, బీజేపీ పార్టీ నాయకులు విజయ్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల సమస్యలు పరిష్కరించండి

**గుమ్మఘట్ట జనవరి 25 ప్రభాతవార్త**



నూతన జాయింట్ కలెక్టర్ ను కలిసిన ఎం ఆర్ పి ఎస్ నాయకులు

నూతన జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ ను ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి కె కుళ్లాయప్ప ఆధ్వర్యంలో... మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా అనంతపురం జిల్లాలో ఎస్సీ ఎస్టీ లపై దాడులు నిర్మూలించాలని ఇంకా కొన్ని గ్రామాలలో అంటరానితనం నిర్మించాల్సిన అవసరం ఉంది అని ఎస్సీ ఎస్టీ భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని కలెక్టర్ కి తెలపడం జరిగినది. కలెక్టర్ స్పందించి సమస్యలన్నీ కాలయాపన లేకుండా త్వరితగతన పరిష్కారం చేస్తామని తెలపడం జరిగినది. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ చిన్న కిష్టప్ప, మహేష్, రాజు, మధు, కలవడం జరిగినది.

## అంగరంగ వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం

**డి.హిరెహాళ్ జనవరి 25 ప్రభాతవార్త**



భక్తుల కోలహాల మధ్య కదులుతున్న స్వామివారి రథం

ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవ వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం డి.హిరెహాళ్ మండల పరిధిలోని కళ్యం గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి రథోత్సవ వేడుకలను ప్రతి ఏటా రథసప్తమి ఉత్సవం సందర్భంగ స్వామి వారి రథోత్సవ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వేకువ జామునే స్వామివారి సన్నిధానం నుండి గంగ పూజకు బయలుదేరి అర్చకుల సమక్షంలో ముందుగా గంగపూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. స్వామి వారికి గంగపూజ అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సాయంకాలం రథోత్సవం ను పురస్కరించుకొని స్వామివారి తెరుకు బలి అన్నం పెట్టి భక్తుల కోలాహల మధ్య మంగళ వాయిద్యాలతో పురవీధుల గుండా స్వామివారి రథంను గ్రామ సమీపంలోని పాదకట్టకు తీసుకెళ్లారు. ఈ బ్రహ్మోత్సవ వేడుకల్లో ప్రజా ప్రతినిధులతో పాటు కర్ణాటక ప్రాంతానికి చెందిన భక్తులతోపాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకొని స్వామివారి ఉత్సవాలను తిలకించారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ ఐ గురుప్రసాద్ రెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

## ఘనంగా రథసప్తమి వేడుకలు



రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**కనేకల్ జనవరి 25 ప్రభాతవార్త**

కనేకల్ గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, ప్రత్యేక అలంకరణలు, ధూపదీప నైవేద్యాలతో విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అర్చకులు వేణు స్వామి, విజ్జి స్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించగా, అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారిని పట్టణంలోని ప్రధాన వీధుల గుండా రథయాత్రగా ఊరేగించారు. రథయాత్రను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. రథసప్తమి వేడుకలు కనేకల్ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా, భక్తి శ్రద్ధలతో ముగిశాయి.

## ఫుడ్ పాయిజన్ ఘటన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: గౌనీ ప్రతాప్ రెడ్డి



**కనేకల్ జనవరి 25 ప్రభాతవార్త**

కనేకల్ మండల పరిధిలోని 43 ఉడేగోళం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తీసుకున్న విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురైన ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోందని రాయదుర్గం నియోజకవర్గ భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌనీ ప్రతాప్ రెడ్డి అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ తో పాటు వంట కాంట్రాక్టర్‌పై తక్షణమే సస్పెన్షన్ విధించి, కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎంపీడీవో విజయసింహారెడ్డి గారితో ఫోన్ ద్వారా మాట్లాడి తన అభ్యంతరాలను తెలియజేశామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలకు చెందిన 26 మందికి పైగా విద్యార్థులు ఆహార విషబాధకు గురై ఆసుపత్రికి తరలించబడటం అత్యంత దురదృష్టకరమని ఆయన అన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండాలంటే సంబంధిత అధికారులు ఎంపీడీవో, తహసిల్దార్, మండల విద్యాధికారులు పూర్తి బాధ్యత వహిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు వారానికి కనీసం ఒక్కసారైనా పాఠశాలను సందర్శించి వంట సామగ్రి నాణ్యతను పరిశీలించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు ఎదురైతే జీపీఆర్ హెల్ప్‌లైన్ నెంబర్ 7386566233కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## రెడ్డి సంఘం జేపసి ఆధ్వర్యంలో ర్యాలీ

**కళ్యాణ మండపం నిర్మించాలని పిలుపు**

**హిందూపురం జనవరి 25 ప్రభాతవార్త**

శ్రీ సత్య సాయి జిల్లా రెడ్డి జేపీసీ సంఘం అధ్యక్షులు వెంకటేష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా కవి యోగి వేమన జయంతి ఉత్సవాల్లో ఆదివారం ఆర్ అండ్ బి అతిథి గృహం నుంచి రెడ్డి కులస్తులు ర్యాలీ నిర్వహించారు. బెంగళూరు రోడ్డు లోని వేమన విగ్రహం చేరుకొని వైయస్సార్సీపి ముఖ్య నేత గుడ్డంపల్లి వేణు రెడ్డి తదితర నాయకులు నివాళులర్పించారు. అనంతరం స్థానిక మారుతీ లేఔట్ ప్రాంతంలో ఉన్న రెడ్డి సంఘం స్థలంలో సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేణు రెడ్డి మాట్లాడుతూ ఎంతో విలువైన రెడ్డి సంఘం స్థలం కాపాడడంలో డాక్టర్ అశ్వర్థ రెడ్డి సహకారం మరువలేనివని కొనియాడారు. లేకపోతే ఎప్పుడో కబ్జాకు గురి అయ్యేదని అన్నారు. ఇదే ప్రదేశంలోనే రెడ్డి సంఘం కళ్యాణ మండపం నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. వేమారెడ్డి రచించిన పద్యాలు ఎన్ని తరాల కైనా స్ఫూర్తిని ఇస్తాయని అన్నారు. ఈరోజు జరిగిన ఉత్సవాల ర్యాలీ



నివాళులర్పిస్తున్న దృశ్యం

కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ప్రయత్నించడం శోచనీయమని అన్నారు. పార్టీలకతీతంగా రెడ్డి కులస్తులంతా ఐక్యం కావాలని జేపీసీ అధ్యక్షులు వెంకటేష్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యనారాయణస్వామి ఆలయంలో వైభవంగా రథసప్తమి వేడుకలు





ప్రత్యేక పూజలందుకొంటున్న సూర్యనారాయణస్వామి, భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

**-నేత్రపర్వంగా ఉషా, ఛాయా సమేత సూర్యనారాయణస్వామి కళ్యాణోత్సవం**

**-భక్తిశ్రద్ధలతో మహాసౌర పూర్వక అరుణ సూర్య నమస్కారాలు, రుద్రాభిషేకం**

**-వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు**

**ఉరవకొండ, జనవరి 25 ప్రభాతవార్త**

చోళరాజుల కాలం 13వ శతాబ్ధంలో నిర్మించబడిన రాష్ట్రంలోనే రెండవదిగా, భారతదేశంలోనే 8వ దేవాలయంగా, ప్రపంచంలోనే దక్షిణాభిముఖముగా ఉన్న ఏకైక సూర్యదేవాలయంగా చరిత్రకెక్కిన ఉరవకొండ మండలంలోని బూదగవి గ్రామంలో వెలసిన సూర్యనారాయణస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం మాఘ శుద్ధ పర్వదిన రథసప్తమి వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు షోడశోపచార పూజ, రామలింగేశ్వరునికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, సూర్యునికి మహాసౌర పూర్వక అరుణ సూర్యనమస్కారాలు, రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపై ఛాయా, ఉష సమేత సూర్యనారాయణుని ఉత్సవమూర్తులను కొలువుదీర్చి వేద పండితుల మంత్రోశ్చరణలు, మేళతాళాలు, మంగళవాద్యాల నడుమ కళ్యాణోత్సవాన్ని నిర్వహించగా తిలకించిన భక్తులు మంత్రముగ్దులయ్యారు. అనంతరం అష్టోత్తర శత క్షీరాభిషేకం కొనసాగింది. మహాగణపతి హోమం, నవగ్రహ, మృత్యుంజయ, అయుష్య, రుద్రస్వాహాకార, మహాసౌర పూర్వక, అరుణ, దుర్గాసూక్త హోమాలు జరిగాయి. స్వామివారిని దర్శించుకోవడానికి జిల్లా నలుమూలల నుండే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలతోపాటు తెలంగాణ, కర్నాటక ప్రాంతాల నుండి పెద్దఎత్తున భక్తులు తరలిరాగా సాయంత్రం వరకు రద్దీ కొన సాగింది. భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉరవకొండ యుపీఎస్ సీఐ బి.మహానంది ఆధ్వర్యంలో సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు. కాగా రథసప్తమి ఆదివారం సెలవురోజు రావడంతో అంచనాలకు మించి భక్తులు తరలిరావడంతో గంధరగోల పరిస్థితి నెలకొంది, సరైన ఏర్పాట్లు లేక అనేక మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోకుండానే వెనుదిరగడం కనిపించింది. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ సి.చిరంజీవి, కమిటీ సభ్యులు మహేంద్రగౌడ్, సుధాకర్, అర్చకులు ప్రకాష్‌స్వామి పాల్గొన్నారు.

## ఓటు ప్రాధాన్యత ఎనలేనిది

**- డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణ**



రెవిన్యూ సిబ్బంది ర్యాలీ చేస్తున్న దృశ్యం

**గుత్తి, జనవరి 25 ప్రభాతవార్త**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో శక్తివంతమైనదని మండల డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణ పేర్కొన్నారు. గుత్తి పట్టణంలో ఆదివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యత కలిగిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం రెవిన్యూ కార్యాలయం నుండి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఆనంద్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా రథసప్తమి వేడుకలు

**గుత్తి, జనవరి 25 ప్రభాతవార్త**



ప్రత్యేక పూజలు చేసిన దృశ్యం

పట్టణంలో ఆదివారం భానుసప్తమి, రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు గావించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణస్వామి స్తోత్రాలు, ఆదిత్య హృదయ పారాయణం, ఆర్ఘ్య ప్రదానం చేశారు. తదుపరి మంగళహారతి నిర్వహించి భక్తాదులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మహిళా మండలి, యువజన సంఘం, సభ్యులు పాల్గొన్నారు.

## రూ.32 లక్షలతో తండాలో పంచాయితీ భవన్

**-టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి చేతుల మీదుగా భూమిపూజ**



పనులు ప్రారంభిస్తున్న మండల కన్వీనర్

**గోరంట్ల, జనవరి 25 ప్రభాతవార్త**

మండలంలోని కరావులపల్లి తండాలో పంచాయతీ భవన్ నిర్మాణానికి భూమిపూజతో పాటు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర బిసి సంక్షేమశాఖ ఎస్.సవితమ్మ ఆదేశాల మేరకు 32 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతన పంచాయతీ భవనం నిర్మాణానికి ఆదివారం కరావులపల్లి తండాలో టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరావులపల్లి తండాలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం పంచాయతీ భవన్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి సవితమ్మ అహర్నిశలు కృషి చేస్తున్నారని, ప్రతి గ్రామంలోను మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్, సింగిల్ విండో అధ్యక్షులు బెల్లాలచెరువు చంద్ర, 5 మ్యాన్ కమిటీ మెంబర్ గంగాధర్, ఏపి ఎన్‌జిఒ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, మాజీ సర్పంచు ఉత్తమరెడ్డి, సీనియర్ నాయకులు నిమ్మల శ్రీధర్, సర్పంచు రమాదేవి, మాజీ వార్డు మెంబర్ పసుపులేటి శ్రీనివాసులు, వెంకటరెడ్డి, మాజీ వైస్ ఎంపిపి భాస్కర్‌రెడ్డి, స్టోర్ డీలర్ శ్రీనివాసులునాయక్, ప్రతాప్‌నాయుడు. రామచంద్రనాయక్, రామస్వామినాయక్, ఆచారినాయక్, జగదీష్‌నాయక్, కృష్ణానాయక్, షణ్ముఖనాయక్. శ్రీశైలం శ్రీనివాసులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆశీస్సులు తీసుకున్న ఎంపీ బీ.కే తనయుడు సాయికళ్యాణ్



సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ ఆశీస్సులు తీసుకుంటున్న ఎం పీ బీ.కే తనయుడు సాయికళ్యాణ్

**పెనుకొండ జనవరి 25 (ప్రభాతవార్త)**

హిందూపురం పార్లమెంట్ సభ్యులు మీకే పార్థసారథి తనయుడు యూకే లో విదేశీ విద్యను ముగించుకొని స్వదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా తన తండ్రి ఎంపీ బి కే పార్థసారథి తో కలిసి ఆదివారం అమరావతి లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయుడును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ నాయుడు లు బి.కే పార్థసారథి వారసుడు సాయికళ్యాణ్ ను ఆశీర్వదించారు.

## ఘనంగా 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం

**-కళాశాలలు, పాఠశాలల విద్యార్థులతో పట్టణంలో అవగాహన ర్యాలీ**

**-హాజరైన ఈఆర్‌వో, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.తిప్పేనాయక్**





విద్యార్థులతో నిర్వహించిన ఓటరు దినోత్సవ అవగాహన ర్యాలీ

**ఉరవకొండ, జనవరి 25 ప్రభాతవార్త**

పట్టణంలో ఆదివారం 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా జరిగింది. ఉరవకొండ-149 అసెంబ్లీ నియోజకవర్గ ప్రత్యేక అధికారి, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.తిప్పేనాయక్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి అందరూ ఓటరు దినోత్సవ టీ షర్టులు, చోపీలు ధరించి పాఠశాల, కళాశాలల విద్యార్థులతో నా భారత్-నాఓటు అనే నినాదంతో పట్టణ ప్రధాన రోడ్డు గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్లాక్‌టవర్ కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్‌వో డి.తిప్పేనాయక్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకై నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు కల్గిన ప్రతిఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది వజ్రాయుధం లాంటిదని మనల్ని పాలించే వారిని మనమే ఎన్నుకోవడం జరుగుతుంది కనుక ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాలవద్ద రంగోలి కార్యక్రమం నిర్వహించి రంగు రంగుల ముగ్గులు వేయించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వరప్రసాద్, సీనియర్ సహాయకులు అశ్వర్థనారాయణ, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వజ్రాయుధం: తాహశీల్దార్





విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన దృశ్యం

**రొళ్ల జనవరి25 ప్రభాత వార్త:**

మండల తహశీల్దార్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని ఆవిన కుంట సమీపంలో గల కస్తూరిబాయ్ బాలికల పాఠశాలలో ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులతో అవగాహన కల్పిస్తూ, ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఒక వజ్రాయుధమన్నారు. ప్రభుత్వాలు పాలకులను మార్చే శక్తి ఓటుకే ఉందన్నారు. ఓటును దుర్వినియోగం చేయకుండా ప్రలోభాలకు గురికాకుండా అభివృద్ధిని ఆకాంక్షించే నాయకుడినే ఎన్నుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విఆర్ఓ లక్ష్మీనరసింహప్ప, పాఠశాల ప్రిన్సిపల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డుకు ఆర్ఐ ఎంపిక

**రొళ్ల జనవరి25 ప్రభాత వార్త:**



గిరియప్ప

మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గిరియప్ప ఉత్తమ అవార్డుకు ఎంపికైనట్లు స్థానిక తాసిల్దార్ షేక్షావలి తెలిపారు. తమ విధుల్లో ప్రజాసేవలో ఆయన చూపిన కృషి, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రజలకు అందించిన సేవలకు నేడు గణతంత్ర వేడుకలలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

# ప్రాచీన జైనదేవాలయంలో వార్షికపూజ మహోత్సవం

- పార్శ్వతీర్థంకరుడు జన్మాభిషేక కళ్యాణం విశేష పూజలు

**పూజల్లో పాల్గొన్న మంత్రి భర్త వెంకటేశ్వరరావు,తహసిల్దార్ స్వాతి**



పీఠాధిపతి ఆశీర్వాదం తీసుకుంటున్న దృశ్యం

**పెనుకొండ జనవరి 25 (ప్రభాతవార్త)**

పెనుకొండ పట్టణంలోని ప్రాచీన జైనదేవాలయంలో ఆదివారం వార్షిక పూజ మహోత్సవం పచ్చేపార్శ్వనాథస్వామి దేవాలయంలో పార్శ్వతీర్థంకరుడు జన్మభిషేక కళ్యాణం విశేషపూజలు దేవాలయ అర్చకులు అజిత్ ప్రసాద్ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసింహారాజపుర లక్ష్మీసేన భట్టారకులు హాజరై వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు తన సందేశమును అందించి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు, తహసిల్దార్ స్వాతి, అర్బన్ టిడిపి కన్వీనర్ శ్రీరాములు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీరాజపుర పీఠాధిపతి లక్ష్మీ సేనస్వామి ఆశీర్వాదములు తీసుకొని పచ్చేపార్శ్వనాత స్వామి దేవాలయం అభివృద్ధికి మంత్రి సవిత తన వంతు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. జైన దేవాలయం సంబంధించిన పాదబెట్ట భూమి జాతీయ రహదారి వద్ద వైజంక్షన్ సమీపంలో గతంలో ఉండేదని, అయితే కాలక్రమేనా ఆభూమి నీ ఫారెస్ట్ ఆధీనంలోకి తీసుకున్నారని కావున ఆ భూమిని రికార్డులు పరిశీలించి దేవాలయానికి అప్పజెప్పాలని తహసిల్దార్ స్వాతికి దేవాలయం ట్రస్ట్ వారు విన్నవించారు. ఈభూమి రికార్డులు పరిశీలించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రికార్డులు కరెక్ట్ గా ఉంటే న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు సురేష్ కుమార్, సెక్రటరీ పద్మనాభ, ట్రెజరర్ ఏ. రాజన్ , టిడిపి మహిళా నాయకురాలు చంద్రకాంతమ్మ, లక్ష్మీదేవి,టిడిపి నాయకులు ప్రభంజన్ స్వామి, సుబ్రహ్మణ్యం,బి.కె చంద్రశేఖర్, సోము,సాయి రమేష్ ,మెప్మా ఆర్పీలు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు, పెనుకొండ ప్రజలు తదితరులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

# కార్మికుల హక్కులను హరించే చట్టాలను రద్దు చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

**పుట్టపర్తి టౌన్, జనవరి 25, ప్రభాతవార్త**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరించే చట్టాలను రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు పేర్కొన్నారు. ఆయన సిఐటియు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు హరించి,కార్మిక చట్టాలను సవరించి కార్మిక ప్రయోజనాలకు భంగం కలిగించేలా చేస్తున్నాయనీ, వివిధ రంగాలలో పనిచేస్తున్న సంఘటిత, అసంఘటిత కార్మికులకు కనీసం వేతనం పెంచాలని, ఏళ్ల తరబడి పోరాటాలు సాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ పెట్టుబడిదారుల కంపెనీలకు ప్రయోజనాలను చేకూర్చేలా వ్యవహరిస్తోందన్నారు. కావున కార్మిక సంఘాలతో ఫిబ్రవరి 12న సమ్మెను నిర్వహించనున్నామని దీనిని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమ్మెలో కార్మికుల సమస్యలను తెలుసుకొని కార్మిక వర్గం కోసం భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి జడ్పీ శ్రీనివాసులు, జి యల్ నరసింహులు, దిల్షాద్,కోశాధికారి లక్ష్మీనారాయణ,పైపల్లి గంగాధర, అంకె ముత్యాలు, పెదబల్లిబాబా, బాబ్జాన్, రాము,తదితరులు పాల్గొన్నారు.

# గురు చైతన్య ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ ఎంపిక

**శ్రీ సత్య సాయి జిల్లా వైద్యము జనవరి 25 ప్రభాతవార్త**

సత్యసాయి జిల్లా కేంద్రంలోని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గురు చైతన్య ఉపాధ్యాయ సంఘం (జీయూఎస్) నూతన జిల్లా కమిటీని ఎంపిక చేశారు.ఈ కార్యక్రమం సంఘం వ్యవస్థాపకులు పాలేల రామాంజనేయుల యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా గౌరవాధ్యక్షులుగా రామకృష్ణ, జిల్లా అధ్యక్షులుగా గోరంట్ల మండలానికి చెందిన నీలం అశోక్, ప్రధాన కార్యదర్శిగా జి. మల్లికార్జున, ఆర్థిక కార్యదర్శిగా బి. రాంప్రసాద్, అదనపు ప్రధాన కార్యదర్శిగా లోకేశ్వరి ఎంపికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా ప్రభాకర్‌ను నియమించారు.జిల్లా ఉపాధ్యక్షులుగా వెంకటేష్ పీడీ, రెడ్డప్ప రెడ్డి, సుభాష్ నాయక్, సుధాకర్‌లను, జిల్లా కార్యదర్శులుగా నాగరాజు, మదార్ వలీ, తిరుపాల్ నాయక్, ఆలం వలీలను ఎంపిక చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రామాంజనేయులు యాదవ్, జె.ఎస్. రాజేష్, నరసింహులు, మొరార్జీ యాదవ్, దివాకర్‌లు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఏపీ సీపీఎస్ఈఏ రాష్ట్ర కార్యవర్గ సహకారంతో ఏర్పాటవుతున్న గురు చైతన్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్రంలోనే తొలిసారిగా సత్యసాయి జిల్లాలో రథసప్తమి రోజున ఏర్పాటు కావడం విశేషమని తెలిపారు. సీపీఎస్ రద్దే ప్రధాన లక్ష్యంగా సీనియర్ ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ఉపాధ్యాయ సమస్యలపై చైతన్యవంతమైన పోరాటం సాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ఏపీ సీపీఎస్ఈఏ వ్యవస్థాపకులు, గురు చైతన్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు యాదవ్‌తో పాటు బాలు, శేషాద్రి, విజయ్ కుమార్, మొరార్జీ, బాలకృష్ణ, నాగభూషణ, కె. నాగేంద్ర, సోమిరెడ్డి, రవీంద్ర, కిష్టప్ప, శ్రీరాములు, మల్లి, ఈ. నాగేంద్ర, హనుమంతు, మిథున్ కుమార్, నరసింహులు, శివశంకర్, రామకృష్ణ, దివాకర్, ప్రవీణ్, ఎం. సుధాకర్, ఏపీ పీఈటీ అండ్ సేప్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

# ఘనంగా అంబిగర చౌడయ్య జయంతి వేడుకలు



బారిక కులాస్తుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు

**కనేకల్ జనవరి 25 ప్రభాతవార్త**

కనేకల్ గ్రామంలో ఆదివారం శ్రీ నిజ శరణ అంబిగర చౌడయ్య జయంతి వేడుకలు భక్తుల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మహిళలు కలశాలతో గంగి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం గ్రామ పురవీధుల గుండా శ్రీ చిక్కనేశ్వర స్వామి దేవాలయానికి కలశాలతో ఊరేగింపుగా చేరుకుని స్వామివారికి అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. పూజల అనంతరం శ్రీ నిజ శరణ అంబిగర చౌడయ్య స్వామివారి ఫోటోను ట్రాక్టర్లపై ఉంచి, వైద్యాల మధ్య దిగువగేరు నుంచి బస్టాండ్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో గంగపుత్రులు, వారి కుటుంబీకులు, గ్రామస్థులు భారీ సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు. భక్తుల జయజయధ్వానాలు, భజనలు, సాంప్రదాయ కార్యక్రమాలతో గ్రామం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో మేళవించింది.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

- వైద్య పరీక్షలు చేయించుకున్న 500 మంది ప్రజలు



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం, వైద్యులతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

**చెన్నేకొత్తపల్లి, జనవరి 25 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన చెన్నై కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ నందు ఆదివారం అనంతపురం కిమ్స్ సమీరా హాస్పిటల్ వారిచే సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,తన, సొంత నిధులతో, ఉచితంగా, గుండె, కంటి, దంత వైద్య శిబిరం నిర్వహించారు.ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ శిబిరంలో కనగానపల్లి రామగిరి చెన్నై కొత్తపల్లి మండలాలు చెందిన 500మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ ఆరోగ్య పరీక్షల్లో సుమారు రెండు వేల రూపాయల నుండి మూడువేల రూపాయల విలువైన వివిధ రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందించారు.

**షుగర్ మరియు బీపీ పరీక్షలు :**

ఈసీజీ టుడి ఎకో వంటి గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని వైద్య సలహాలు పొందారు. కిమ్స్ సమీరా హాస్పిటల్ వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది రోగులను క్షుణ్ణంగా పరీక్షించి తగు జాగ్రత్తలు సూచించారు. వయసు పైబడిన తరుణంలో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కిమ్స్ సవేరా హాస్పిటల్ వారిచే నిరుపేదలైన ప్రజలకు, ఖరీదైన వైద్య పరీక్షలు నిర్వహించినందుకు సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..రామగిరి సర్కిల్‌లోని చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి ఫ్యాక్షన్ మండలాలోని ప్రజలు ఫ్యాక్షన్‌లో మునిగిపోయి ఆరోగ్యాలు పట్టించుకోకుండా ఉంటారని, కావున ఇటువంటి వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. అదే విధంగా ఫ్యాక్షన్‌కు, గొడవలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రామగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్, శ్రీధర్, చెన్నేకొత్తపల్లి ఎస్సై సత్యనారాయణ, రామగిరి ఎస్సై, కనగానపల్లి ఎస్సై పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ అందించిన బలమైన ఆయుధం ఓటు హక్కు

- ఆర్డిఓ ఆనంద్ కుమార్ ,డీఎస్పీ నర్సింగప్ప



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డిఓ ఆనంద్ కుమార్

**పెనుకొండ జనవరి 25 (ప్రభాతవార్త)**

భారత రాజ్యాంగం ద్వారా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మనకు అందించిన బలమైన ఆయుధం ఓటు హక్కు అని, ఈ హక్కును ప్రజలు సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా సమర్థవంతమైన పాలన వ్యవస్థను ఏర్పరుచుకోవడం జరుగుతుందని,ప్రలోభాలకు లొంగి ఓటు హక్కుని దుర్వినియోగం చేసుకోరాదని ఆర్డీవో ఆనంద్ కుమార్ ,డీఎస్పీ నర్సింగప్పలు తెలిపారు. ఆదివారం16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల యందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా ఆర్డిఓ ఆనంద్ కుమార్, డి.ఎస్.పి నర్సింగప్పలు పాల్గొని విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించి తద్వారా వారి తల్లిదండ్రులలో చైతన్యం తీసుకురావాలనే లక్ష్యంతో రాజ్యాంగం కు లోబడి 16వ జాతీయ ఓటర్ దినోత్సవం విద్యార్థులతో నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. 2011వ సంవత్సరం జనవరి 25వ తేదీన మొదటి జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకోవడం జరిగిందని, ఇప్పుడు16వ జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. తహసిల్దార్ స్వాతి మాట్లాడుతూ ఓటు హక్కు విలువ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఓటు హక్కును బలమైన ఆయుధంగా చేసుకొని మంచి ప్రభుత్వాలను ఎన్నుకున్నప్పుడే ప్రజలు ప్రజాస్వామ్యంలో జీవిస్తారని తెలిపారు.ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ ఓటు హక్కు విలువ తెలుసుకొని ఆలోచించి ఓటు వేయాలని, ప్రజలు స్వచ్ఛత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. అర్బన్ టిడిపి కన్వీనర్ శ్రీరాములు మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకోకపోతే దేశానికి ద్రోహం చేసినట్లేనని ప్రజలు ఆలోచించి ఓట్లు వేసి మంచి ప్రభుత్వాలను, మంచి నాయకులను ఎన్నుకున్నప్పుడే అన్ని రంగాలలో అభివృద్ధి సాధించేందుకు వీలవుతుందని తెలిపారు. పలువురు పలువురు వక్తలు మాట్లాడిన అనంతరం సీనియర్ ఓటర్లను సన్మానించి,వ్యాసరచన పోటీలు,క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకటరమణ,రెవెన్యూ ఇన్స్పెక్టర్ షాషావలి,వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, మెప్మా ఆర్పిలు, టిడిపి నాయకులు విశ్రాంత ఉపాధ్యాయులు ప్రభంజనస్వామి, నారాయణ నాయక్ , తెలుగు మహిళ లు మాజీ సర్పంచ్ చంద్రకాంతమ్మ,లక్ష్మీ దేవి,చంద్రశేఖర్,సోము, తదితరులు పాల్గొన్నారు.

# సామూహిక సూర్యనమస్కారాలు



యోగా చేస్తున్న దృశ్యం

**ధర్మవరంటౌన్, జనవరి 25 ప్రభాతవార్త**

రథసప్తమి సందర్భంగా పట్టణంలోని కాలేజ్ సర్కిల్లో రోడ్డుపై ఆదివారం యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో 108 సామూహిక సూర్యనమస్కారాలు చేశారు. ఉదయం 69గంటలు పుంచి 730గం టల వరకు సూర్య భగవానుడికి పూజలు చేసి జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. అనతరం పలువురు యోగ ఆసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ కార్యదర్శి పులిచెర్లవేణుగోపాల్, బీజేపీనియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్ బాబు, పట్టణ అధ్యక్షులు జింకాచంద్ర, యోగా అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల సోమేశ్వరరెడ్డి, హిందీపండిట్ వేణుగోపాల్ యోగ మాస్టర్స్ నారాయణరెడ్డి, ఈశ్వరయ్య,సభ్యులు కరెంటు ఆది,రామన్న, తిరుమలేశ్, కట్టారవికుమార్, సాయిప్రసాద్, రామకృష్ణనాయక్ పాల్గొన్నారు.

# ఘనంగా రథసప్తమి వేడుకలు



వేంకటేశ్వర ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

**ధర్మవరంటౌన్, జనవరి25 ప్రభాతవార్త**

పట్టణంలోని శ్రీనివాసనగర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను ఆదివారం అర్చకులు రాజేశ్ ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని పట్టువస్త్రాలతో పాటు వివిద రకాల పూలతో అలంకరించి పూజలుచేశారు. స్వామివారికి అభిషేకాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుండి పీఆర్టీ సర్కిల్ వరకు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీపై ఉంచి ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షులు చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్, ప్రధానకార్యదర్శి జింకారాజేంద్రప్రసాద్, సభ్యులు చెన్నంశెట్టి శ్రీనివాసులు,చెన్నంశెట్టి రమేశ్ కుమార్, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

# బీజేపీ సీనియర్ నాయకుడు మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీనేత హరీశ్ బాబు

**ధర్మవరంటౌన్, జనవరి 25 ప్రభాతవార్త**

పట్టణంలోని గూడ్ షెడ్ కొట్టాలకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు బోయ చిన్నపోతలయ్య (56) ఆదివారం ఉదయం అకస్మాత్తుగా మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జి హరీశ్ బాబు మృతుడి నివాసానికి చేరుకుని బౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్నపోతలయ్య పార్టీకి చేసిన సేవలను ఎన్నటికి మరువలేమని, ఆయన అకాల మృతి బీజేపీకి తీరనిలోటని ఆయన తెలిపారు.అనంతరం మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో బీజేపీ నాయకులు చిన్నలింగమయ్య, వేణు తదితరులు ఉన్నారు.

# టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా ఏజ్జె శంకర్



ఎమ్మెల్యే పరిటాల సునీతను సన్మానిస్తున్న ఏజ్జె శంకర్

**చెన్నేకొత్తపల్లి, జనవరి 25 ప్రభాతవార్త**

చెన్నేకొత్తపల్లి మండలానికి చెందిన ఎజ్జె కురుబ శంకర్ శ్రీ సత్య సాయి జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా కమిటీలో కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమింపబడిన సందర్భంగా మండల ముఖ్య నాయకులతో పాటు వెంకటాపురం నివాసంలో రాప్తాడు శాసన సభ్యురాలు పరిటాల సునీత, ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్‌ని గౌరవపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ అధిష్టానం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని ఈ సందర్భంగా ఎజ్జె శంకర్‌కి ఎమ్మెల్యే సూచించారు. ఎజ్జె శంకర్ గతంలో గ్రామ కమిటీ అధ్యక్షునిగా, జన్మభూమి కమిటీ సభ్యునిగా, గ్రామపంచాయతీ ఉపాధ్యక్షులుగా, ఎఫ్ పి షాప్ డీలర్‌గా, ధర్మవరం మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా, హిందూపురం పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధిగా పనిచేయడం జరిగిందని అన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొంది సరైన నాయకున్ని ఎన్నుకోండి




ప్రతిజ్ఞ చేస్తున్న అదికారులు

**ధర్మవరంటౌన్, జనవరి25 ప్రభాతవార్త**

యువతీయువకులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఓటుహక్కును పొంది ఓటు అనే ఆయుదంతో సరైన నాయకుడిని ఎన్నుకు0టే దేశభవిష్యత్తు అభివృద్ధి పథంలో నడుస్తుందని తహసీల్దార్ సురేశ్ బాబు పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఆదివారం అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి కాలేజ్ సర్కిల్ లో అధికారులు, బీఎల్ ఓలు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సంపాదించుకోవాలని, అందు కోసం ప్రభుత్వం వాటికి కావాల్సిన ఏర్పాట్లను కూడా చేస్తోందన్నారు. దేశభవిష్యత్తును మార్చే శక్తి ఓటు అనే ఆయుధానికి ఉందన్నారు. ఈ సందర్భంగా వృద్ధఓటర్లు, యువ ఓటర్లను సన్మానించారు. అదేవిధంగా రంగరంగు ముగ్గులపోటీలు నిర్వహించి ఇందులో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ తహసీల్దార్ నారాయణస్వామి. ఎన్నికల అధికారి చెన్నకేశవనాయుడు, వీఆర్ ఓ రవిశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రథసప్తమి వేడుకలు

**గోరంట్ల, జనవరి 25 ప్రభాతవార్త**

రథసప్తమి సందర్భంగా ఆదివారం సిద్ద సమాధి యోగా గురువులు సురేష్, భక్తవత్సలంల ఆధ్వర్యంలో సామూహిక సూర్యనమస్కారాలను ఎస్పివిఎం డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. 108 సార్లుగా సామూహిక సూర్యనమస్కారాలు మంత్రోచ్చారణతో చేశారు. ఈ కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, ధనుంజయ, గాజుల రమేష్, బాలమోహన్, పుష్ప, త్రివిక్రమ్, నగేష్, రత్నమయ్య, మదనమోహన్, బత్యాల లక్ష్మినారాయణ, వెంకటేష్, మధు, కరాటే విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



సూర్యనమస్కారాలు చేస్తున్న దృశ్యం

# వైయస్ఆర్ సీపీ బలోపేతమే లక్ష్యంగా గ్రామ కమిటీలు ఏర్పాటు

- సంస్థాగత సమావేశంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



పాపంపేట వైఎస్ఆర్సిపి నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి.

**అనంతపురం రూరల్, జనవరి 25 ప్రభాతవార్త**

రాప్తాడు నియోజకవర్గం రూరల్ మండలం పాపంపేట పంచాయతీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ, స్థాయి కమిటీల నిర్మాణానికి సంబంధించిన అవగాహనా కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, అందరూ సమన్వయంతో, ఎలాంటి లోపాలు లేకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామ కమిటీలను పటిష్ఠంగా, త్వరితగతిన ఏర్పాటు చేసేలా స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రతి స్థాయి నాయకులు, కార్యకర్తలు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు – అందరికీ సరైన స్థానం లభించేలా, ప్రతి ఒక్కరి కృషి గుర్తింపు పొందేలా, పార్టీకి గట్టి పునాది వేసి భవిష్యత్తు విజయాలకు మార్గం సుగమం చేసేలా ఈ నిర్మాణం తీర్చిదిద్దాం. కమిటీల ఏర్పాటు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ సహకారం అందించి ఈ పనిని త్వరగా పూర్తి చేయాలని, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్సి పి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాబోయే ఎన్నికలలో అనంత వెంకట్రామిరెడ్డి గెలుపుకు ప్రతి కార్యకర్త పనిచేయాలి

- ఎంపీటీసీ మహబూబ్ బి, ఎంఎస్ఎస్ సాథిక్ వలి.

**అనంతపురం రూరల్, జనవరి 25 ప్రభాతవార్త**



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్ఎస్ సాథిక్ వలి

అనంతపురం రూరల్ రుద్రంపేట పంచాయతీ ఎంపీటీసీ మహబూబ్ బీ ఆధ్వర్యంలో నివాసము వద్ద గ్రామ కమిటీ ముందస్తు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎం ఎస్ ఎస్ సాదిక్ వలి మాట్లాడుతూ రుద్రంపేట పంచాయతీలో ప్రతి ఒక్క కార్యకర్త గ్రామ కమిటీలు చేరాలని పేరుపేరునా పిలుపు నిచ్చారు 2029లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలవడానికి అలాగే అనంతపురం అర్బన్ శాసనసభ్యుడుగా అనంత వెంకటరామిరెడ్డి గెలుపు కొరకు ప్రతి ఒక్కరూ గ్రామ కమిటీలో చేరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధితో పనిచేయాలని ప్రతి ఒక్క కార్యకర్తకు పిలుపునిచ్చారు దయచేసి కోవర్ట్ పనులు చేయకుండా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి కష్టపడాలని అలాగే కష్టపడిన వారికి అనంత వెంకట్రాం రెడ్డి గుర్తించి ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తారని భరోసా ఇచ్చారు. అనంతపురంలో ఎంతో అభివృద్ధి చేసిన ఘనత అనంత వెంకట్రామిరెడ్డి మనము రుద్రంపేట పంచాయతీలో గర్వంగా చెప్పాలంటే ఏదైనా విపత్తు వర్షాభావం వచ్చినప్పుడు మనము నగరములోకి రావాలంటే ఎంతో ఇబ్బంది పడేవారు అలా ఇబ్బంది పడకుండా బ్రిడ్జి కట్టించిన ఘనత వెంకట్రాం రెడ్డి, అలాగే రుద్రంపేట పంచాయతీ రోడ్డును 90 పూర్తి చేస్తే ఎన్నికల కోడ్ వలన 10 పర్సెంట్ మిగిలినది దానికి రంగులు వేసి మేము చేశామని తెలుగుదేశం వారు ప్రతి ఒక్క మీటింగులో సెల్ఫ్ డబ్బా కొట్టుకుంటున్నారు. అభివృద్ధి అంటే ఒక అనంత వెంకటరామిరెడ్డికే సాధ్యము కనుక 2029లో కచ్చితంగా కూటమి ప్రభుత్వము ఇంటికి పోయివైయస్సార్,ప్రభుత్వముప్రజల్లోకి వస్తుంద ని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మహబూబ్ బీ, బీసీ సెల్ నగర ఉపాధ్యక్షులు ఆవేట రామ్మూర్తి, వార్డు మెంబర్, సుభద్రమ్మ, పరంధామ, వెంకట్రాముడు, దూద్ వలి, కాజా, మేజర్ చంద్ర, అక్కమ్మ, జయమ్మ, నాగమణి, షేక్ బార్ ఆరిఫా, తదితరులు పాల్గొన్నారు

# ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా యు.హిదయతుల్లా ఎంపిక

**అనంతపురం రూరల్, జనవరి 25 ప్రభాతవార్త**



యు.హిదయాతుల్లా

అనంతపురం రూరల్ మండలం కక్కల పల్లి క్లస్టర్ గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించే యు. హిదయాతుల్లా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ పంచాయతీ కార్యదర్శి గా జిల్లా అధికారులు ఆయనను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులు నన్ను ఉత్తమ పంచాయతీ కార్యదర్శి గా ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందని, ఈ అవార్డు నాకు రావడంతో నాతోపాటు మా కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఆనందం వ్యక్తపరచడం జరుగుతుందని, ఈ అవార్డుతో నాకు మరింత బాధ్యత పెరిగిందని ఆయన తెలియజేశారు.

# పర్యావరణ ప్రేమికునికి ఘనసన్మానం

- తమ్మినేనిఅశోక్‌ను అభినందించిన పర్యావరణ వేత్త భాస్కర్ నాయుడు



తమ్మినేని అశోక్‌కు చిత్రపటం అందజేస్తున్న దృశ్యం.

**అనంతపురం రూరల్, జనవరి 25 ప్రభాతవార్త**

దేశంలోనే రెండో కరువు జిల్లా దేశంలోనే అతి తక్కువ వర్షపాతం కలిగిన ఈ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ గొప్ప సేవగా అభివర్ణించున్న తమ్మినేని అశోక్ కు పర్యావరణం పరిరక్షణపై ఎంతో మక్కువ ఉన్న విషయం ను గమనించిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్మెంట్ సంస్థ సభ్యులు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ధ్రువకుమార్ రాజేష్ నాగేంద్ర సతీష్ మరియు పర్యావరణ వేత్త భాస్కర్ నాయుడు కలిసి జ్ఞాపిక,మొక్కను అందజేసి ఘనంగా సన్మానించారు ఇలాంటి వారి వల్ల కూడా ప్రకృతి సంరక్షణ జరుగుతోందని కొనియాడారు. ఇలాగే జిల్లావ్యాప్తంగా ప్రకృతి పరిరక్షణకు ఎవరు సహకరించినా, సేవ చేసినా సన్మానిస్తామని విజ్ఞులైన వారు పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావాలని కోరారు.

# పేకాట స్థావరంపై దాడి

**శెట్టూరు,జనవరి 25, ప్రభాతవార్త**

మండల పరిధిలోని బసంపల్లి గ్రామంలో ఆదివారం ఆగ్రామ పొలాల్లో పేకాట ఆడుతుండగా యస్ఐ.సుమన్ తమ సిబ్బందితో చాక చౌక్యంగా దాడి చేసి నలుగురు వ్యక్తులను పట్టుకొని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ .జగదీష్ ఆదేశాల మేరకు డిఎస్పీ .రవిబాబు సీఐ.నీలకంఠేశ్వర్ సూచనల ప్రకారం యస్ఐ.సుమన్ కు రాబడిన సమాచారం మేరకు పేకాట రాయుళ్ళను అరెస్ట్ చేశారు అంతే కాకుండా వారి వద్దనుండి రెండు ద్విచక్ర వాహనాలు 7,200/రూపాయల నగదును స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు యస్ఐ.సుమన్ తెలిపారు.ఈ దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

